క్లుప్తంగా

డీఎన్‌ఆర్‌ను కలిసిన బాబి


డీఎన్‌ఆర్‌ను సత్కరిస్తున్న బాబి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును బుధవారం ఆ పార్టీ పంచాయతీ రాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి మల్నీడి మోహనకృష్ణ (బాబి) మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన డీఎన్‌ఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దల్లి మోహన్‌రెడ్డి, ముమ్మడి దుర్గారావు, కంభపు అప్పలరెడ్డిలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాత మహేష్ వర్ధన్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి కలిదిండికి చెందిన చిట్టూరి కార్తీక్ మహేష్ వర్ధన్ బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గో సంరక్షణశాలకు దాణా విరాళం


దాత వెంకటేశ్వరరావు అందించిన దాణా బస్తాలు.

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణశాలకు మూలపాడుకు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు బుధవారం 10 టన్నుల దాణాను విరాళంగా అందజేశారు. ఈ దాణా బస్తాలను ఒక లారీలో గోసంరక్షణ శాల వద్ద ఆలయ అధికారులకు అందించారు. దాతను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు


జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అన్నప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 2300 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నప్రసాద వితరణకు దాతలుగా గుదే లక్ష్మి, చింతలపూడి సరోజిని, కోదాటి శేషారత్నం, ప్రేమ్ సాయికుమార్, శ్రీదేవిలు, మరికొందరు భక్తులు దాతలుగా వ్యవహరించారని పేర్కొన్నారు. తొలుత స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కుక్కునూరు: గోదావరి వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కుక్కునూరు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామానికి పరిహారం అందించాలని కోరారు. ఈనెల 23 నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బండి వెంకటేశ్వర్లు, కిషోర్, కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, సోడే అనిత, సోడే తను పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అన్నదానం

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో అన్నదానం చేశారు. దాతలు గెడ్డం శ్రీనుబాబు, మురళీకృష్ణల ఆర్థిక సాయంతో 70 మందికి అన్నదానం నిర్వహించామని సంఘం ఉపాధ్యక్షులు లింగంకుంట శ్రీనివాస్ తెలిపారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో మోసం

- బస్సుల సంఖ్య పెంచకుండా పథకం అమలా?
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు


చింతలపూడి : హామీల క్యూ ఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు


చింతలపూడి : జ్ఞానారెడ్డి, బాబీలను సత్కరిస్తున్న నాయకులు

చింతలపూడి : మోసానికి నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు మండిపడ్డారు. ఆ పార్టీ మునిసిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద పార్టీ చింతలపూడి పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు (నాగు) అధ్యక్షతన బుధవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి విజయరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మొత్తం 143 హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అమాయకులపై మహిళలపై దౌర్జన్యాలు దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెంచకుండా ఉచిత బస్సు పథకాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు త్సల్లా బత్తుల శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ హోంలో అన్నదానం చేశారు.

జ్ఞానారెడ్డి, బాబీలకు సత్కారం

రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులుగా నియమితులైన జ్ఞానారెడ్డి, మల్నీడి బాబిలను విజయరాజు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, అధైర్య పడాల్సిన అవసరం లేదని కార్యకర్తలు, నాయకులు సూచించారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని విజయరాజు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరావు, జిల్లా పబ్లిసిటీ విభాగం అధ్యక్షులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.చండిప్రియ, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు మిరియాల దిలీప్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గురుబ్రహ్మం, పట్టణ ఉపాధ్యక్షుడు ఎన్ దుర్గారావు, పీఏసీఎస్ మాజీ అధక్షుడు ఆత్కూరు సుబ్బారావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎం ఇమ్మానియేలు, ఎస్టీ సెల్ నాయకులు రామరాజు నాయక్, దారా పేర్రాజు, గోవర్ధనరావు, వెంకటేశ్వరావు, ఎంపీటీసీ విద్యా సాగర్, రెబ్బా గోపీనాథ్, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు హాజరయ్యారు.

పార్టీ బలోపేతానికి కృషి


శ్రీరామ్ మూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న విజయరాజు

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు కోరారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఓ శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణపురం గ్రామానికి చెందిన పలగాని శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తమ ప్రగడ సానుభూతిని తెలియజేశారు. రామన్నపాలెం గ్రామంలో మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో విజయరాజు మాట్లాడారు. పార్టీని బలోపేతానికి శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. పేదల పక్షాన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అంగన్‌వాడీ విభాగ అధ్యక్షులు సాయిల స్వాతి, ఉద్దండి ధనలక్ష్మి శ్రీనివాసరావు, కనికెళ్లి యేసుపాదం, సింగంశెట్టి రాంబాబు, ములకాల రాంబాబు, దేవరపల్లి రామ్మోహన్‌రావు, రామన్నపాలెం గ్రామ అధ్యక్షులు మోహన్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు సాయిన కనక రాజు, టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు మేరుగు బాబురావు, సిద్ది రాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం , మేడంకి విజయ రావు, వాసే ఆనంద్, మానుకొండ దేవరాజు, గుమ్మడి శ్రీను, అచ్చియ్య, వేణు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: సత్యసాయి 24 గంటల ఫీడర్, యరగ్రుంటపల్లి ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని యర్రగుంటపల్లి గ్రామాలకు, నామవరం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు, ఫాతిమపురం ఫీడర్‌లోని అన్ని గ్రామాలకు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈ నెల 21న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

లారీలు ఢీ, ట్రాఫిక్ అంతరాయం


కొయ్యలగూడెం వై జంక్షన్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

కొయ్యలగూడెం: నరసన్నపాలెంలో ఆగి ఉన్న ట్యాంకర్ లారీని వేరొక ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో బుధవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టాంకర్ల టైర్లు ఛిద్రమయ్యాయి. సుమారు ఇరువైపులా 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవైపు స్కూల్ బస్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కొయ్యలగూడెం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

13న మెగా లోక్ అదాలత్


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి

చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 13న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సీహెచ్ మధు బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని జడ్జి తెలిపారు. సీఐ టి.క్రాంతి కుమార్, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, చింతలపూడి, టి.నర్సాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడి ఎస్సైలు, కోర్ట్ కానిస్టేబుల్స్, కోర్టు సూపరింటెండెంట్ పి.గుర్వి నాయుడు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 44 మందికి ఉద్యోగాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక సీజీఆర్ టౌన్ హాల్‌లో బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హాజరయ్యారు. జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల నుంచి 154 మంది హాజరుకాగా, వీరిలో 44 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్టు స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి ఎన్ జితేంద్ర బాబు తెలిపారు. అనంతరం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో త్రీమన్ కమిటీ చైర్మన్ మానికల నాగేశ్వరరావు, సభ్యులు పాతూరి అంబేద్కర్, కొంచాడ దుర్గాప్రసాద్‌లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరద సహాయ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కుక్కునూరు: వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సహాయ కేంద్రాలకు తరలించి భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. వరద సహాయ కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, తాగునీరు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం తయారీలో నాణ్యమైన సరుకులు, కాయగూరలు వాడాలని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించాలని అన్నారు. వరద ముంపు తగ్గే వరకు ఆయా గ్రామాల ప్రజలు పునరావాస సహాయక కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణ, డీఆర్‌డీఓ పీడీ ఆర్ విజయరాజు, డీఎస్పీ ఎం వెంకటేశ్వరావు, తహసీల్దార్ కె.రమేష్‌బాబు, ఎంపీడీఓ నరసింహరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ కార్మికులు జాగ్రత్తలు పాటించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై జయబాబు

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ గెలలు కోసే సమయంలో కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై ఎం.జయబాబు సూచించారు. టి.నరసాపురం శివాలయ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గెలల కోసే సమయంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఎస్సై జయబాబు మాట్లాడుతూ విద్యుత్ శాఖ నుంచి లైన్ క్లియరెన్స్ తీసుకున్న తరువాతే ఆయిల్‌పామ్ గెలలు కోయాలని సూచించారు. అన్నింటికన్నా ప్రాణం విలువైనదని వివరించారు. టి.నరసాపురం ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు టూ ఫేజ్ సప్లయి సమయంలో లైన్ క్లియరెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. రైతులు అవసరమైన చోట ట్రాన్స్‌కో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, లైన్ షిఫ్టింగ్‌లు చేపట్టాలని కోరారు. నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏరియా మేనేజర్ రెడ్డి మాట్లాడుతూ గెలలు కోసే కార్మికులు విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ఫ్యాక్టరీ తరుపున సమకూర్చుతున్న బూట్లు, గ్లౌజ్‌లు విధిగా వాడాలని సూచించారు. సమావేశంలో బొర్రంపాలెం ఏఈ శ్రవణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక, ఉద్యానశాఖ ఇన్‌ఛార్జ్ అధికారి షాపియా షహరీన్, సొసైటీ మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, ఆయిల్‌పామ్ రైతు ప్రతినిధి పెట్టిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబు అంటేనే మోసం.. జగన్ అంటే నమ్మకం


యర్రంపల్లి గ్రామంలో క్యూ ఆర్‌కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చింతలపూడి : రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోతో బాబు అంటేనే మోసం, జగన్ అంటే నమ్మకం అని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి పిలుపునిచ్చారు. చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామంలో జానకి రెడ్డి ఇంటి ఆవరణలో బుధవారం పార్టీ గ్రామస్థాయి విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు ఎస్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. జానకిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కూడా విఫలమైందని తెలిపారు. తగినన్ని బస్సులు ఏర్పాటు చేయకుండా మహిళలను ఉచిత బస్సు పేరుతో మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న ఆదరణ చూసి ఆయన పర్యటనలను అడ్డుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ప్రజలే తగిన విధంగా కూటమి అక్రమ పాలనకు అంతం పలుకుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, ఎంపీటీసీ మేరి, రైతు విభాగం నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్, చింతం రాణి, గొంది రాజు, కుమారి, నరసింహరావు, బుల్లా దాసు, టీఆర్‌కే రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న బేబీ కమల

జంగారెడ్డిగూడెం: అపరిశుభ్ర వాతావరణం వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ బేబీ కమల అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. బేబీ కమల మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా నీరు నిల్వ ఉండకూడదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.బ్యూలా మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలకు, పుట్టిన పిల్లలకు కలిగే ఇబ్బందులను వివరించారు. మత్తు పానీయాల జోలికి యువత వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సీహెచ్ రమాదేవి, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కోఆర్డినేటర్ ఎం మధు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా పవిత్రారోహణ



పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు.
పవిత్రాలతో దర్శనమిస్తున్న స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్రారోహణను అర్చకులు వేడుకగా నిర్వహించారు. యాగశాలలో ఉంచిన పవిత్రాలతో అర్చకులు, పండితులు ఆలయ ప్రదక్షిణలను నిర్వహించారు. పవిత్రాలను వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీనివాసుని మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైనా, ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్లపైను ఉంచారు. తర్వాత ఆలయ యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలపై వినతి

జంగారెడ్డిగూడెం: స్థానిక కూరగాయల డైలీ హోల్ సేల్ మార్కెట్లో ఉన్న పంది, ఇతర జంతువుల మాంస విక్రయ కేంద్రాలను పట్టణానికి దూర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, కోనేరు చెరువు చుట్టూ వాకర్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, వర్తకులకు పార్కింగ్, విశ్రాంతి షెడ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్తు, సమరసతా సేవ ఫౌండేషన్, హిందూ సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎంపీడీఓ ఆఫీసుకు క్యూ కట్టిన పింఛన్ బాధితులు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఉంగుటూరు: ఊపిరితిత్తులు దెబ్బతిన్న తనకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రద్దు చేశారంటూ ఎ.గోకవరం గ్రామానికి చెందిన ఆకుల నాగతులసి, కన్ను పని చేయని తన పింఛన్ రద్దు చేశారంటూ ఉంగుటూరుకు చెందిన పేద్ద వరప్రసాద్, యాక్సిడెంట్‌లో చేయి దెబ్బ తిన్న తనకు ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు పింఛన్ రద్దు చేశామరంటూ ఎ.గోకవరానికి చెందిన నెరుసు లక్ష్మి, పెరాలసిస్‌తో బాధపడుతున్న తనకు పింఛన్ రద్దు చేశారంటూ శ్రీను అనే బాధితుడు ఇలా 47 మందికి పింఛన్ రద్దు కావడంతో ఉంగుటూరు ఎంపీడీఓ రాజ్‌మనోజుకు ఫిర్యాదు చేసింది. తమ బాధను ఎంపీడీఓకు వివరించారు. రీ వెరిఫికేషన్ పేరుతో మే, జూన్ నెలల్లో ఇంటింటికీ బయట జిల్లాల నుంచి వచ్చిన డాక్టర్ల బృందం సభ్యులు బెడ్‌రిడెన్ పేరుతో పింఛన్లుత అందుకుంటున్న వారి ఇళ్లకు తిరిగి పరిశీలించారు. వారి పరిశీలన అనంతరం 40 శాతం కంటే వైకల్యం లేని వారికి పింఛన్ అవసరం లేదని తేల్చి చెప్పేశారు. దీంతో ఇప్పటి వరకు నెలకు ఆరు వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందుకున్న వారు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో కాలం వెళ్లదీసిన తాము ఎలా బతికేదని కనిపించే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవిస్తున్నారు.

ఒడిదుడుకులతో రొయ్య సాగు

- అయోమయంలో ఆక్వా రైతులు
- ధర పతనంతో నష్టాల బాట


రొయ్యలను ఎగుమతి చేస్తున్న కూలీలు

గణపవరం: అసలే నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రొయ్య సాగుకు ట్రంప్ సుంకాల దెబ్బ గట్టిగానే తగిలింది. అన్ని రకాల కౌంట్ రొయ్యల ధర ఢమాల్‌మంది. ఒక్క రోజులోనే కేజీ రొయ్య ధర రూ.50 నుంచి రూ.60 వరకు పడిపోయింది. దీంతో రొయ్య రైతులు లబోదిబోమంటున్నారు. ట్రంప్ ఇటీవల రెండో విడతగా భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించిన రోజే రొయ్య ధర పడిపోవడం గమనార్హం. ఇప్పటికే వ్యాధులు చుట్టుముట్టి 75 శాతం రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా మాత్రమే రొయ్య సాగు కొనసాగుతుంది. దీంతో సరకు అవసరానికి సరిపడా లేకపోవడంతో వ్యాపారులు రొయ్య ధర బాగా పెంచేశారు. ఈ నెల ఆరంభం నుంచి రొయ్య ధర కిలోకు రూ.60 నుంచి రూ.100 వరకూ పెరగడంతో రొయ్య రైతులు సంబరపడ్డారు. అప్పటికే చాలా చెరువులు ఖాళీ అవడంతో మిగిలిన కొద్దిపాటి రైతులకైనా పెంచిన ధరలు దక్కి, నష్టాల ఊబి నుంచి బయటపడతారని ఆశించారు. అయితే అనుకోని పిడుగులా రెండో సారి ట్రంప్ సుంకాల పెంపుదల రొయ్య ధరపై తీవ్ర ప్రభావం చూపింది.

భారీగా తగ్గిన ధర

దీంతో 100 కౌంట్ రొయ్య కిలో రూ.280 వరకూ కొనుగోలు చేయగా ట్రంప్ భారత్ దిగుమతులపై మరో 25 శాతం సుంకాలు పెంచినట్లు ప్రకటించడంతో ఒక్క సారిగా 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.240కి పడిపోయింది. ఇక మిగిలిన కౌంట్‌లో ఉన్న రొయ్యల ధరకూడా కిలోకు రూ.50 పైనే తగ్గించేశారు. మన దేశం నుంచి అమెరికాకు ఎక్కువగా 40 లోపు కౌంట్ రొయ్యలే ఎగుమతవుతాయి. ఆ దేశానికి 50కు పైన కౌంట్ ఉన్న రొయ్యలు వెళ్లే సమస్యే లేదు. అయినా 100 కౌంట్ రొయ్య ధరను కూడా వ్యాపారులు భారీగా తగ్గించేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించగానే పనిలో పనిగా అమెరికా దేశానికి ఎగుమతి చేయని రొయ్యల ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమెరికా పెంచిన దిగుమతుల సుంకాలు ఈ నెల 7వ తేదీ నుంచి అమలులోకి రాగా, రెండో సారి పెంచిన 25 శాతం సుంకాలు ఈ నెల 27వతేదీ నుంచి అమలులోకి రానుంది. మొత్తానికి ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలలో రొయ్యసాగు జరుగుతుంది. కాల్వలకు నీరు వదిలాక జూన్‌లో సీడ్ వేసిన చాలా చెర్వులు సీడ్‌వేసిన నెలరోజులకే ఖాళీ అయ్యాయి. సీడ్‌లో నాణ్యత లేకపోవడం, వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో మూడు వంతుల చెర్వులు అర్ధంతరంగా ఖాళీ అయ్యాయి. ఈచెర్వులలో కౌంట్ 200 నుంచి 300 వరకూ ఉండటం, రొయ్యకు సరైన ధర లేకపోవడంతో రైతులకు కనీసం సగం పెట్టుబడులు కూడా దక్కలేదు.